క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పొంగళ్లు



ఓగూరువాండ్లపల్లిలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

సీతారామపురం: మండలంలోని ఓగూరువాండ్లపల్లిలో పోలేరమ్మ, సీతారామపురంలో అంకాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రిని గంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆయా గ్రామాల్లోని గ్రామదేవతల ఆలయాల వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండేలా చూడాలని గ్రామదేవతలను వేడుకున్నారు.

ఆర్థిక సాయం

వరికుంటపాడు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చెంచల వెంకటరమణ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు దాత ఆంద్రా బాలగురువారెడ్డి ఆదివారం రూ.10 వేలు నగదు సాయం అందజేశారు. తొలుత వెంకటరమణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట సొసైటీ మాజీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, మాలకొండ్రాయుడు, సందిరెడ్డి నాగేశ్వరరావు ఉన్నారు.

మోటార్‌సైకిల్ అపహరణ

ఉదయగిరి: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఓ ఇంటి ముందు నిలిపిఉంచిన మోటార్‌సైకిల్ అపహరణకు గురైన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు..బసిరెడ్డి విజయ్‌కుమార్ బాలాజీనగర్‌లోని తన సమీప బంధువు అనిల్ ఇంటికి శనివారం వచ్చారు. రాత్రి ఇంటి ముందు మోటార్‌సైకిల్‌ను నిలిపి అక్కడే నిద్రపోయాడు. ఆదివారం ఉదయం లేచి చూడగా మోటార్‌సైకిల్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఉదయగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని ఉదయగిరి పోలీసులు తెలిపారు. వివరాలు..ఈ నెల 22న మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామానికి చెందిన దేవండ్ల వెంకటసుబ్బయ్య (39) తన మోటార్‌సైకిల్‌పై సీతారామపురం మండలం చిన్ననాగంపల్లె గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అయ్యవారిపల్లె సమీపంలో ఒక్కసారిగా అడవి పందులు అడ్డు రావడంతో వాటిని ఢీకొని అదుపుతప్పి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి వెంకటసుబ్బయ్య మృతి చెందాడు. ఆదివారం ఆయన మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

జలదంకి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను కావలి డిపో డీ శ్రీనివాసులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ బస్టాండ్‌లోని ఫ్లెక్సీలను తొలగించామని తెలిపారు. కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీలు వంటి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ కంచె ఏర్పాటు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం కొట్టాలు గ్రామంలో చిన్నపనాయుడు అనే రైతు తన మామిడి తోట చుట్టూ ప్రమాదభరితంగా విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. పందుల బెడద నుంచి తోటను కాపాడుకునేందుకు చుట్టూ ఉన్న పెన్సింగ్‌కు విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. దీనిని చూసిన కొందరు రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం పరిశీలించి రైతుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పందుల పోటు నుంచి తప్పించుకునేందుకు విద్యుత్ కంచె ఏర్పాటు అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ఇలా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన విషయం తెలియక ఎందరో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలను గుర్తుచేస్తూ మరోసారి ఇలా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా దేవరాల

మర్రిపాడు: మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా దేవరాల గంగాధర్‌యాదవ్ నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



శోభాయాత్రలో సీతారామలక్ష్మణుల వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు



ఆత్మకూరు పురవీధుల్లో సాగుతున్న హనుమాన్ శోభాయాత్ర



ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముని విగ్రహం



శోభాయాత్రలో కోలాట ప్రదర్శన

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



విశేషాలంకరణలో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులు

ఆత్మకూరు: పట్టణంలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత బైపాస్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. వర్షం రాకతో ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర రవితేజ కల్యాణ మండపం, పాత సినిమాహాలు మీదుగా మెయిన్ బజార్, సత్రం సెంటర్, చావడి, హిల్‌రోడ్డు, ఎరుకలసానినగర్, సోమశిలరోడ్డు సెంటర్, ఎల్‌ఆర్‌పల్లి, ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. అక్కడి నుంచి మెయిన్ రోడ్డు, మున్సిపల్ బస్టాండ్, దళితకాలనీ మీదుగా రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంది. శోభాయాత్రలో ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసిన హనుమంతుడు, సీతారామలక్ష్మణుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక రథంలో రామలక్ష్మణుల వేషధారణలోని చిన్నారులు భక్తులను ఆకట్టుకున్నారు. సుమారు 4 గంటల పాటు సాగిన శోభాయాత్రలో మహిళలు, చిన్నారుల కోలాటం, పండరి భజన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రవితేజ కల్యాణ మండపం వద్ద నుంచి భక్తులు మోటార్‌సైకిళ్లపై యాత్రలో పాల్గొన్నారు. డీఎస్పీ జీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ గంగాధర్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బీ సాయిప్రసాద్ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కాగా శోభాయాత్ర అనంతరం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఏఎస్‌పేటలో గురువులతో పూర్వవిద్యార్థులు



సీతారామపురం: గురువులతో పూర్వ విద్యార్థులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1990–1995 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు బుజ్జయ్య, రత్నంను ఘనంగా సత్కరించారు.

26 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

సీతారామపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమ గురువులు షఫీఅహ్మద్, శ్యామ్‌బాబు, సుధాకర్, పీసీ అల్లూరురాజు, జనార్దన్‌రాజు, వెంకటరెడ్డి, కృష్ణయ్య, మహబూబ్‌మస్తాన్‌ను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. పూర్వవిద్యార్థులు మేడం వెంకటేశ్వర్లు, సాదు చిరంజీవి, రావూరి సుబ్బారావు, పిడుగు రమేష్, కడుగు నారాయణ, కడుగు కేశవరావు, అల్లిక వెంకటేశ్వర్లు, మోహన్‌కృష్ణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకల జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2000–01 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతో హాజరై ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. పాతికేళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థులు తమ మన మనోభావాలను వ్యక్తం చేశారు.



గురువులతో గుండెమడకల పాఠశాల పూర్వ విద్యార్థులు

ఘనంగా చెన్నకేశవ స్వామి ఉత్సవాలు



వరికుంటపాడు: మండలంలోని మహమ్మదాపురంలో దేవరకొండ వంశస్తుల ఆధ్వర్యంలో పలనాటి చెన్నకేశవస్వామి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొయ్యలపాడు చెన్నకేశవస్వామి కొణతములకు నాగిలేటి వద్ద ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పోతురాజుకు బోనం కడవలో పొంగళ్లు సమర్పించి పూజలు నిర్వహించారు. పల్నాటి ఆచారవంతులకు చాపకూల బంతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పల్నాటి ఆచారవంతులు తరలివచ్చారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ



కావలి (జలదంకి): డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులకు రూ.60వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కావలిలో వెంగళరావునగర్‌లోని డీఆర్ విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఊపిరితిత్తుల నిపుణులు కే శ్రీనివాసులు, భావన, ఎముకలు, కీళ్ల నిపుణులు భానుప్రకాష్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యావేత్త, మానవతామూర్తి డీఆర్ పేరు మీద ఆయన కుమారులు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డి ప్రతినెలా పేద వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేస్తూ ఆదుకోవడం అభినందనీయమన్నారు. సేవా సమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఆత్మకూరు: విద్యుత్‌శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని యూఈఈయూ కార్యాలయంలో ఆత్మకూరు డివిజన్ 3వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఎస్‌పీడీసీఎల్ యూనియన్ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు వీ సుధాకర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యుత్ కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సభ్యులుగా జీ శివప్రసాద్, కే హజరత్తయ్య, సీహెచ్ ఓంకారం, ఎస్ విజయరామిరెడ్డి, ఎస్‌కే మస్తాన్, మహిళా కార్యదర్శిగా కే శాంతి ఎన్నికయ్యారు. ఆత్మకూరు డివిజన్ గౌరవాధ్యక్షుడు మస్తానయ్య, జిల్లా టౌన్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు కొండమూరి హజరత్తయ్య, సుమన్, ప్రసన్న, సునీల్, సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌జే డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటి చాంపియన్‌షిప్‌ను సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఎస్‌ఆర్‌జే విద్యార్థులు చాంపియన్‌షిప్‌ను సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా చేసి మంచి శిక్షణ ఇచ్చిన పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లిక శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ గంగాధర్

శిథిలావస్థకు చేరిన గోదాము

సోమశిల: అనంతసాగరంలోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన గోదాము శిథిలావస్థకు చేరింది. దాని స్థానంలో కొత్త గోదాము నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో ఏటా ధాన్యం నూర్పిళ్ల సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదాము ఉంటే గిట్టుబాటు ధరలు లేని సమయంలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. గత రబీ సీజన్‌లో ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేవు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాము సౌకర్యం లేకపోవడంతో రైతులు కల్లాల్లోనే తక్కువ ధరకు ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎడగారు పంట చేతికొచ్చే సమయానికి శిథిలావస్థకు చేరిన గోదాము స్థానంలో కొత్త గోదామును నిర్మించి కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.



ప్రజలపై పన్నుల భారం మోపేందుకు సిద్ధం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఏడాది కాలంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే ప్రజలపై పన్నుల భారం మోపేందుకు సిద్ధం అవుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ కమిటీ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇళ్ల కొలతలు వేయిస్తోందన్నారు. దీన్ని బట్టి చూస్తే త్వరలో ఇళ్ల పన్నులు పెంచేందుకు సమాయత్తమవుతున్నట్లుగా తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలో కేవలం బడ్జెట్ పేరుతో ఒక్కసారి మాత్రమే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారని తెలిపారు. ఇలా ఏడాది పాటు కౌన్సిల్ సమావేశం నిర్వహించని మున్సిపాలిటీ ఆత్మకూరు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలు, వాటి పరిష్కారంపై మాట్లాడేందుకు కౌన్సిలర్లకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారన్నారు. మున్సిపల్ అభివృద్ధికి రూ.53 కోట్లు మంజూరైనట్లుగా ఆర్భాటపు ప్రకటనలు చేసిన కూటమి నాయకులు, అధికారులు ఆ నిధులు ఏమయ్యాయో సమాధానం చెప్పడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో అభివృద్ధి పనులు మొదలుపెట్టకపోతే ఆందోళనలు చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు.

జీవనశైలిలో మార్పులు అవసరం

వింజమూరు(ఉదయగిరి): సమాజంలో వేగంగా మారుతున్న జీవనశైలిలోని మార్పుల కారణంగానే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని నివారించుకునేందుకు జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ వివేకానందరెడ్డి సూచించారు. వింజమూరులోని మాశిలామణి ఆస్పత్రిలో ఆరోగ్య సమస్యలు–పరిష్కారం అనే అంశంపై ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రొబోటిక్ చికిత్స విధానం ద్వారా తక్కువ ఖర్చుతో అరిగిపోయిన మోకాలి కీళ్ల శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. మోకాలి నొప్పుల సమస్యలతో బాధపడే వారు వీలైనంత వరకు నొప్పుల మాత్రలు వేసుకోవడం తగ్గించుకోవాలని, వాటిని ఎక్కువగా వాడితే కిడ్నీల సమస్య తలెత్తుతాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం, ఆరోగ్యం, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పలువురు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మాజీ డీఎంహెచ్‌ఓ మాశిలామణి, వైద్యఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోహిణి కార్తె రాకతోనే కరుణించిన వరుణుడు



రామస్వామిపల్లి సమీపంలో వర్షం

ఆత్మకూరురూరల్: వేసవిలో రోహిణి కార్తెకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ కార్తెలో కాసే ఎండలకు రోళ్లు సైతం పగులతాయని పెద్దలు చెబుతుంటారు. ఆదివారం రోహిణి కార్తె ప్రారంభం రోజే వరుణుడు కరుణించాడు. సాయంత్రం వేళ వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మండలంలో వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. దీంతో వేసవితాపంతో తల్లడిల్లుతున్న ప్రజలు కాస్తా సేదతీరారు.

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడితో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం తేలికపాటి వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఆశాజనకంగా పత్తిసాగు

- ఉదయగిరి నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం పూత దశలో పంట
- గిట్టుబాటు ధరలపై రైతులు ఆశలు



జలదంకిలో సాగులో ఉన్న పత్తి పంట

జలదంకి: వేసవిలో సాగు చేసిన పత్తి పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. ఈ ఏడాది ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 25 వేల ఎకరాలకుపైగా పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల సమాచారం. పత్తి సాగుకు పెట్టుబడులు తక్కువ కావడంతో పాటు దిగుబడులు, ధరలు బాగా ఉండడంతో రైతులు పత్తి సాగు వైపు మొగ్గుచూపారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. పత్తి సాగుకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతున్నట్లు రైతులు తెలిపారు.

ఎకరాకు 12 క్వింటాళ్లపైగా దిగుబడులు

వేసవిలో సాగుచేసిన పత్తి పంట దిగుబడులు బాగానే వస్తున్నాయి. గతేడాది ఎకరాకు 12 నుంచి14 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చినట్లు రైతులు తెలిపారు. పత్తి పంట కాలం ఐదారు నెలలు ఉంటుంది. పంటను కంటికి రెప్పలా కాపాడుకుని సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు పెరుగుతాయి. ఈ ఏడాది వర్షాలు కూడా సకాలంలో పడడం పత్తి పంటకు కలిసొచ్చింది.

ధరలు ఉంటే రైతుకు ఆదాయం

పత్తి దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఆశాజనకంగా ఉంటే ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు. గతంలో క్వింటా పత్తి రూ.10 వేల వరకు పలికింది. గత రెండేళ్లుగా క్వింటా పత్తి ధర రూ.7వేల నుంచి రూ.8 వేల వరకు పలికింది. ఈ ఏడాది ధరలు పెరిగితే ఆదాయం ఉంటుందని రైతులు ఆశతో ఉన్నారు. అయితే మార్కెట్‌లో పత్తి ధర ఏ మేరకు ఉంటుందోనని ఓ వైపు ఆందోళన చెందుతున్నారు. గిట్టుబాటు ధరలు ఉంటే పెట్టుబడులుపోగా ఎకరాకు రూ. 50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఐదెకరాల్లో పత్తి సాగు చేశా



నాకున్న ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. మార్చి చివరి వారంలో పంట సాగు చేశా. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. వర్షాలు సకాలంలో పడడంతో పంట ఆశాజనకం ఉంది. దిగుబడులు బాగా వస్తాయని, ధరలు కూడా బాగుంటాయనే ఆశతో ఉన్నాం.

–వీ శ్రీనివాసులరెడ్డి, బ్రాహ్మణక్రాక

ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు



పత్తి సాగుకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. కూలీలు, ఎరువులు, పురుగు మందుల ఖర్చులు ఎక్కువవడంతో పెట్టుబడులు అధికమయ్యాయి. దిగుబడుల సమయంలో పత్తి క్వింటా రూ.8 వేలకు తగ్గకుండా ఉంటే ఆదాయం వస్తుంది.

–జీ మాల్యాద్రి, రైతు, జలదంకి